ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలను నివారించండి:సిపిఎం

ప్రజాశక్తి-నాయుడుపేట ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు తావు లేకుండా చూడాలని సీపీఎం నాయకులు నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ నాయుడుపేట పరిధిలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హుల జాబితా ఎక్కువగా ఉందని, వైసీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. ఓట్లు నమోదు పారదర్శకంగా ఉండాలని, లేని పక్షంలో ఈసీని అవసరమైతే కోర్టుకూ వెళ్లాల్సి వస్తుందని ఆయన తెలిపారు. రీఎంట్రీ ఓట్లు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని కోరారు. అంతేకాకుండా బిఎల్ఓ ద్వారా ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఓట్లు సంబంధించి డీఈవో సంతకం కచ్చితంగా ఉండాలని, అలా లేని పక్షంలో బోగస్ ఓట్లుగా తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు శివ, ముకుందా ,చాపల వెంకటేశ్వర్లు, రజక వత్తిదారుల సంఘం పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ హంగామా..!

'స్మార్ట్‌సిటీ' పనులకు నిధులు విడదల్చకనే..

- 101 ప్రాజెక్టులు పూర్తయ్యేదెప్పుడో..?
- పేరుకుపోతున్న 'బిల్లుల' బకాయిలు

'గరుడ వారధి పనులు ఎంతవరకు వచ్చాయి... వినాయక సాగరం పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు.. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు పూర్తి చేస్తారా? లేదా... కమాండ్ కంట్రోల్ భవనం వెంటనే పూర్తి చేయాలి.. ప్రతిరోజూ ఉదయం సమీక్ష.. సాయంత్రాలు క్షేత్రస్థాయి పరిశీలన.. కౌన్సిల్ సమావేశాల్లో అధికారులపై నిందలు.. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం అంటూ హెచ్చరికలు..' ఇదీ తిరుపతి నగరంలో జరుగుతున్న 'స్మార్ట్‌సిటీ' పనులకు సంబంధించి ఉన్నతాధికారుల ఓవరాక్షన్.. 'ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండానే' పనులెలా చేయించాలంటూ అధికారుల మనోగతం వారికి పట్టదు.. ఎంతసేపు పత్రికల్లో వార్తల కోసం 'సమీక్ష'ల పేరుతో పర్యవేక్షణ తప్ప, పైసా విదల్చడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.. చేసిన పనులకే బిల్లులు పేరుకుపోయి లబోదిబోమంటున్నారు. ఇదండీ తిరుపతిలో 'స్మార్ట్‌సిటీ' పనులు జరుగుతున్న తీరు.. నత్తలతో పోటీ పడుతున్నాయి.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరాన్ని స్మార్ట్‌సిటీగా ప్రకటించి రూ.1622.96 కోట్ల అంచనాతో 101 ప్రాజెక్టులను పథకంలో పొందుపరిచారు. అందులో స్మార్ట్‌సిటీ మిషన్ నిధులు (కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు) రూ.994.31 కోట్లు కాగా, రూ.628.6503 కోట్లు స్థానిక సంస్థలు, పివాపి విధానంలో సమకూర్చేలా ప్రతిపాదించారు.ఇప్పటికే రూ.185,35 కోట్ల విలువైన 56 ప్రాజెక్టులు పూర్తి కాగా, రూ.1209. 61 కోట్ల విలువైన 43 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.228 కోట్ల విలువైన పనులు టెండర్ల దశలోనే ఉండి పోయాయి. 2021-22 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ.100, 50 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.100.50 కోట్లు మంజూరు. చేస్తున్నట్లు ప్రకటించినా.. ఇప్పటి వరకు విడుదలకు 'నోచుకోలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి నిధుల ఊసేలేదు. దీంతో 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.35.73 కోట్ల విలు వైన బిల్లులు సిఎఫ్ఎంఎస్ అప్లోడ్ చేసిన అధికా రులు.. వాటి విడుదలకు ఎదురుచూస్తుండగా... మరో 75 కోట్ల రూపాయలు విలువైన బిల్లుల కోసమూ నిరీక్షిస్తున్నారు.

స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా 628 .25 కోట్లు ఇతర సంస్థల నుంచి సమకూర్చేందుకు అవకాశం ఉందని అప్పట్లో అధికారులు ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పించారు ఇందులో టిటిడిదే అగ్ర భాగం ఉంది. టిటిడి, ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థల నుంచి రాబట్టనున్నట్లు తెలిపారు. శ్రీనివాస సేతు ప్రాజెక్టు వ్యయం రూ.684 కోట్లలో తితిదే వాటాగా చెల్లించాల్సిన 458. 28 కోట్లలో రూ.200 కోట్లు ఇప్పటి వరకు తితిదే నిధులు విడుదల చేయగా.. స్మార్ట్ సిటీ నిధులు రూ.176 కోట్లు విడుదల చేసింది. తిరుపతి నగరంలో ఏబీడీ ఏరియాలో రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ విద్యుత్ తీగల వ్యవస్థ 50 శాతం పనులు ముగియడంతో రూ.144 కోట్లు చెల్లించనున్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ కోసం రూ.180 కోట్లు కేటాయించగా.. రూ.80 కోట్లతో భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.. సీవోసీ భవనంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే పరికరాలు, ఇతర వస్తువుల కోసం కొనుగోలుకు రూ.100 కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంది. నగరంలో రూ.50 కోట్లతో మల్టీలెవెల్ కారు పార్కింగ్ టెండరు దశకు కూడా చేరలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మొత్తం రూ.570.50 కోట్లు ఇప్పటి వరకు విడుదల అయ్యాయి. రూ.445.89 కోట్లు విని యోగించినట్లు అధికారులు ప్రకటించారు. రూ. 124.61 కోట్లు ఏమయ్యాయనే సందేహం వ్యక్తం అవుతోంది. వీటికి అదనంగా తితిదే నుంచి వచ్చిన రూ.200 కోట్లు కూడా కాంట్రాక్టర్ చెల్లించారు.

కమాండ్ కంట్రోల్ కు నిధులు విడుదలయ్యేనా..?

తిరుపతి స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం తొలగించి వాటి స్థానంలో 80 కోట్లతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఐదు అంతస్తుల భవనం నిర్మాణానికి భూమి పూజ పనులు పూర్తి చేశారు. కేంద్రము రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఈ నిధులు ఇవ్వాల్సి ఉంది. రెండు సంవత్సరాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కమాండ్ కంట్రోల్ భవనం సకాలంలో పూర్తవుతుందా లేదా అన్నది చర్చ జరుగుతుంది. 18 నెలల్లో ఈ భవనం పూర్తి చేయాల్సి ఉంది. నిధులు సకాలంలో విడుదల కాకపోతే ముందుకు సాగే పరిస్థితి లేదు.

'ముక్కంటి'కే టెం'ఢర్'..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెల్‌ఫోన్లు, లగేజీ కౌంటర్ల వద్ద అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి. గతం కంటే తక్కువగా టెండరు దక్కించుకున్న ఓ అధికారపార్టీ నేత భక్తుల నుంచి ఇష్టానుసారం ఫీజు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టరుకు ముక్కంటి ఆలయ అధికారులు అండగా నిలిచి తమ స్వామి భక్తి చాటుకుంటున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ముక్కంటి సాక్షిగా సదరు కాంట్రాక్టరు భక్తులను దోచుకు తింటున్నప్పటికీ అడిగే నాథుడే కరువయ్యారు. ఇదే అదనుగా ఆయన అందినకాడికి దోచుకుతింటున్నా ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండటం గమనార్హం.

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేశ, విదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయం లోపలకు సెల్ ఫోన్లు, కెమెరాలు, లగేజీ, పాదరక్షలు అనుమతించరు. వీటిని ఆలయ ప్రాంగణంలోనే భద్ర పరచడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కౌంటర్ల నిర్వహణ బాధ్యత టెండరు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించడం చాలా కాలంగా ఆనవాయితీగా వస్తోంది. మూడేళ్ల కిందట ఈ టెండరును ఓ కాంట్రాక్టరు రూ.1.08 కోట్లకు దక్కించుకున్నాడు. ఈ కౌంటర్లలో కెమెరాకు రూ.10లు, సెల్ ఫోన్ కు రూ.5లు, లగేజీకి రూ.5లు, పాదరక్షలకు రూ.5వంతున కాంట్రాక్టరు వసూలు చేసే విధంగా నిబంధన విధించారు.

కౌంటర్ల నిర్వహణలో అవినీతి
ఇష్టారాజ్యంగా ఫీజు వసూళ్లు



అపుడు కాంట్రాక్టరు ఈ నిబంధనల మేరకే భక్తుల నుంచి వసూలు చేసే వాడు. ఆ తరువాత కోవిడ్ కారణంగా భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో కొంతకాలం పాటు ముక్కంటి ఆలయం వారే ఈ కౌంటర్ల నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. అప్పట్లో ఆలయం వారు భక్తులకు ధరలు తెలిసే విధంగా కౌంటర్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోవిడ్ తగ్గు ముఖం పట్టడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య మళ్లీ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సెల్ ఫోన్ కౌంటర్ల నిర్వహణ కోసం ఏడాది కిందట మళ్లీ టెండర్లు నిర్వహించారు. ఈ టెండరును శ్రీకాళహస్తి అధికార పార్టీకి చెందిన ఓ నేతకు రూ.78.50లక్షలకు అప్పగించారు. గతంలో కంటే సుమారు రూ.22లక్షలు తక్కువకు టెండరు అప్పగించడంపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన దేవాదాయశాఖ కమిషనరు ఈ టెండరును రద్దు చేసినా సదరు నాయకుడు న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవడం గమనార్హం.

- **ఇష్టానురాజ్యంగా ఫీజు వసూళ్లు**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్ల వద్ద భక్తుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కౌంటర్ల వద్ద వేటికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారన్న కనీస సమాచారాన్ని నిర్వాహకులు పెట్టకపోవడం గమనార్హం. ఈ క్రమంలో భక్తులు అధిక ఛార్జీలు వసూళ్లపై అప్పుడప్పుడూ లగేజీ కౌంటర్ల సిబ్బందితో గొడవలు పడుతున్నారు. కౌంటర్ల వద్ద ఆలయం వారు ఏర్పాటు చేసిన ధరలు తెలియ జేసే సూచిక బోర్డులు తొలగించారు. సెల్ ఫోన్ కు రూ.10, లగేజీకి రూ.10, పాదరక్షలకు రూ.10, కెమెరాకు రూ.30 వంతున వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాలకు చెందిన భక్తుల వద్ద అయితే మరింత ఎక్కువ వసూలు చేస్తున్నారనే ఆరోపణ ఉంది. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ముక్కంటి ఆలయ అధికారులకు ఈ విషయం తెలిసినా సదరు కాంట్రాక్టరుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా ముక్కంటి ఆలయ ఉన్నతాధికారులు స్పందించి లగేజీ కౌంటర్ల వద్ద భక్తుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంపికి అభినందనలు

తిరుపతి సిటీ : శ్రీకాళహస్తి మండలం వేలివేడు గ్రామ పంచాయతీ వేలవేడు బౌద్ధనగర్‌కు కమ్యూనిటీ హాలును మంజూరు చేసిన తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. సామాజిక హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ 16 లోల రూపాయల అంచనాతో కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంకొళ్ళయ్య, గురునాథ్‌కుమార్, చిన్నంప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నటి జాహ్నవి కపూర్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని సినీ నటి శ్రీదేవి కుమార్తె జాహ్నవి కపూర్ దర్శించుకుంది..గురువారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయంలో ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కాలుష్యం లేని సమాజమే కర్తవ్యం : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్

'కాలుష్యం లేని సమాజమే కర్తవ్యంగా ముందుకెళ్లాలని.. ఆరోగ్య సంతోషాలతో కూడిన జీవికను సమాజానికి అందిద్దాం' అని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో నాలుగు రోజుల 12 వ అంతర్జాతీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా మంత్రి డా. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. 'సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ సర్క్యులర్ ఎకానమీ, ఐ పి యల్ ఏ గ్లోబల్ ఫోరని 2022" గురించి నవంబర్ 30 నుంచి డిసెంబరు 3 వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు వచ్చిన సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యర్థ పదార్థాలను పడేయడం సమాజానికి ,వ్యక్తికి , పర్యావరణానికి, భవిష్యత్ తరాలకు శ్రేయస్సు కాదని తెలిపారు. 51 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు నాలుగు రోజుల సదస్సులో చర్చిస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గౌరవ జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో క్లీన్ ఏపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేసారు. వ్యర్థాలను జాగ్రత్తగా ఉపయోగకరంగా చేసుకోవడం, వాటి నుంచి ఆర్థికంగా ఉపకరించే ప్రత్యామ్నాయాలపై సదస్సులో 51దేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు చర్చిస్తారని తెలిపారు. పట్టణ, గ్రామాల్లోని వ్యర్థాలను ఉపయోగకరంగా మార్చే లక్ష్యంతో, రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎస్వీయూలో జరుగుతున్న సదస్సును మంత్రివర్యులు జయప్రదం చేయడానికి రావడం ఆనందదాయకమని ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె రాజారెడ్డి అన్నారు. సదస్సుకు ఆన్‌లైన్ , ఆఫ్ లైన్ ద్వారా సుమారుగా 500మంది

హాజరవుతున్నారని, అంతర్జాతీయంగా వ్యర్థాలపై సరైన చర్చ జరగాలని, అపాయకరమైన వ్యర్థాలు ,పునరుపయోగపడే వ్యర్థాలను శాస్త్రీయ , ఆచరణాత్మ పద్ధతుల ద్వారా అధ్యయనం చేయాలన్నారు. కలకత్తా నుంచి వచ్చిన ఆచార్య సదానంద ఘోష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ వ్యర్థాల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాయని, ఈ సమ్మేళనం చక్కటి ఫలితాలనివ్వబోతుందని తెలిపారు. జపాన్ నుంచి వచ్చిన సిఆర్ సి మొహంతీ మాట్లాడుతూ సదస్సు కాలుష్యంపై ప్రపంచదష్టి ఏమిటని చర్చిస్తుందన్నారు. జర్మనీలోని రోస్టక్ యూనివర్సిటీ నుంచి వచ్చిన యం. నెల్లెస్ మాట్లాడుతూ పారిశ్రామికంగా ఎదిగిన దేశాలు తమ బాధ్యతను గుర్తుంచుకోవాలని,ప్రతి దేశం కార్బన్ బడ్జెట్ ను కేటాయించాల్సిన అవసరాన్ని వివరించారు. నీతిఆయోగ్ సలహాదారు సుధీర్ కుమార్ మనదేశం వ్యర్థాల వినియోగంపై చేస్తున్న కషి తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర వ్యర్థాల రీసైక్లింగ్ , రీయూజింగ్ గురించి ప్రస్తావన చేశారు. ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ , ఆచార్య ఆర్వీయస్ సత్యనారాయణ , డీన్ ఆచార్య విజయభాస్కర రావు , రూసా కో ఆర్డినేటర్ వంశీ రాయల్ పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో వర్చువల్గా అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున వెల్లడించారు. గురువారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి సమావేశపు మందిరంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సును డిసెంబర్ 9, 11 తేదీలలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రాచీన ఆరోగ్య శాస్త్రము ఆరోగ్య విధి, విధానాలు వాటి యొక్క పోకడలు, ఛాలెంజర్స్ ప్రస్తుతం ఉన్నటువంటి సొసైటీ ఏ విధంగా అనువదించుకోవాలి అనే అంశాలపై పూర్తి స్థాయిలో పరిశోధన పత్రాలను ఇందులో సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆచార్య డాక్టర్ రజిని, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

దినచర్యలో క్రీడలు భాగం కావాలి

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థుల దినచర్యలో క్రీడలు భాగం కావాలని క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా, ఎంపి గురుమూర్తి అన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, యువజన శాఖ నిర్వహణలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖల మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న క్రీడా సంబరాలు పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఈ సంబరాలలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. గూడూరు నియోజకవర్గం కోట పట్టణంలో అసంపూర్తిగా ఉన్న స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలనీ మంత్రి రోజా దష్టికి తీసుకెళ్ళి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ

జగనన్న క్రీడా సంబరాల్లో' ఆర్‌కె రోజా

కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు దినచర్యలో క్రీడలు భాగం కావాలని ఆయన అన్నారు. ఒకసారి ఓడిపోయినా మళ్ళీ గెలువచ్చు అనే ఆత్మవిశ్వాసతో ముందుకు వెళ్లాలని, అలాగే ఇంత పెద్ద ఎత్తున జగనన్న క్రీడా ఉత్సవాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కతిక కళలను వెలికితీయడంలో మంత్రి రోజా తనదైన శైలిలో కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. చివరగా మంత్రి రోజా మాట్లాడుతూ హిందువులు సంక్రాంతి, ముస్లింలు రంజాన్, క్రిస్టియన్స్ క్రిస్టమస్ జరుపుకొంటారు కాని, అందరూ కలిసి చేసుకొనే పండగ మన ముఖ్యమంత్రి జగనన్న పుట్టినరోజు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, తిరుపతి నగర మేయర్ శిరీషా కలిసి వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎం. శివశంకర్ రెడ్డిపాల్గొన్నారు.

8కల్లా ఓటర్ల పరిశీలన పూర్తవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రత్యేక ఓటర్ల సవరణ- 2023 మేరకు గత మాసం 9 న ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రకటించిన జాబితాను రానున్న ఏడు రోజుల్లో బి.ఎల్.ఓ లు క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి కావాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి నియోజక వర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం న్యూ డిల్లీ నుండి ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్, అమరావతి నుండి ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్ లతో ప్రత్యేక ఓటర్ల సవరణ- 2023 పై సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ ఈ.ఆర్.ఓ లతో మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాకు సంబంధించి 7 నియోజక వర్గాలలో ఇప్పటికే అందిన ఫారం-6, 7 మేరకు క్షేత్ర స్థాయిలో బి.ఎల్.ఓ లు రానున్న 7 రోజులు ఉదయం 6 నుండే పరిశీలనకు వెళ్ళాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన ఓటర్ల జాబితా, 18 సంవత్సరాల యువత నమోదు చూడాలని అన్నారు. జిల్లాలో మనం గుర్తించిన 247 కళాశాలలో మరొకసారి డ్రైవ్ నిర్వహించి నమోదు చేయవలసి ఉంటుందని అన్నారు. ఇప్పటికే మన దగ్గర దాదాపు 9 వేలకు పైగా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పెండింగ్ లేకుండా అన్ని దరఖాస్తులు పూర్తి కావాలని అన్నారు. 2023జనవరి 5 న ప్రకటించే ఓటర్ల జాబితా తప్పులు లేని పారదర్శకత గా వుండాలన్నారు. డి.ఆర్.ఓ శ్రీనివాస రావు, నియోజకవర్గ ఈ.ఆర్.ఓ.లు గూడూరు- కిరణ్ కుమార్, వేంకటగిరి శ్రీనివాసులు, చంద్రగిరి కనకనరసారెడ్డి, తిరుపతి అనుపమ అంజలి, శ్రీకాళహస్తి- రామారావు, సత్యవేడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్వం స్కూల్లో రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని స్థానిక వరదరాజ నగర్‌లో విశ్వం టాలెంట్ స్కూల్ నందు గురువారం రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలను ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై. సాయి దిలీప్ కుమార్, విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు చేశారు. ఈ పోటీలకు కోచ్‌లుగా డా. కే. గోపినాథ్, వై. ఉమా మహేశ్వరి, ఎం.భువనేశ్వరి, పి.లోకేష్ వ్యవహరించారు.

కండ్ల 'కలక'లం...!

- జిల్లాలో విస్తృతంగా ఇన్ఫెక్షన్
- పాఠశాలల్లో వందలమందికి
- నగరి, పుత్తూరుల్లో ఎక్కువ
- 'హోం క్వారంటైనే' పరిష్కారమా.?

ప్రజాశక్తి -తిరుపతి

'మద్రాస్ ఐ'గా పిలిచే కండ్లకలక జిల్లాలో విస్తతంగా పాకుతోంది. ఇప్పటికే తమిళనాడు లో ఉధతంగా ఉన్న వైరస్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన నగరి, పుత్తూరు, తిరుపతి శివారు ప్రాంతాల్లో ప్రబలుతోంది. తిరుపతి నగరం, రూరల్లోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు సోకింది. ఒకరి ద్వారా మరొకరికి వేగంగా పాకుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఒక్క తిరుపతి నగరంలోని 10 ప్రధాన కంటి ఆసుపత్రులకు రోజుకు 450 నుంచి 500 కేసులు వస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు చెబుతున్నారు. రోజురోజుకీ మద్రాసై పెరుగుతున్న నేపథ్యంలో ఏమాత్రం అశ్రద్ధ చేయొద్దంటూ ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి పేర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కళ్లకలక సోకితే రెండు మూడు రోజుల పాటు 'హోం క్వారంటైన్'లోనే ఉంచితే మంచిదని, బడికి పంపడం ద్వారా ఇతర పిల్లలకు స్ప్రెడ్ అయ్యే అవకాశం ఉందని డాక్టర్లు సూచిస్తున్నారు.

కండ్లకలక అంటే?

కండ్లకలకను పింక్ ఐ అని కూడా పిలుస్తారు. ఇది కంటిలోని పొర (కంజక్టివా)కు ఇన్ఫెక్షన్ సోకి, దాని ఫలితంగా కలిగిన వాపు. కంజక్టివా అనేది కనురెప్పను, కళ్ళలోని తెల్లని భాగాన్ని కప్పి ఉంచే పారదర్శక పొర. కళ్ళ కలకలు ఇన్ఫెక్షన్ కారణంగా పారదర్శక పొర ఎరుపు లేదా గులాబీ రంగులోకి మారడానికి కారణమవుతాయి, అందుకే దీనికి పింక్ ఐ అని పేరు వచ్చింది. కండ్ల కలక మన దష్టిని ప్రభావితం చేయదు.. ఇది ఒక అంటు వ్యాధి కాబట్టి కండ్లకలకకు అది ప్రారంభ దశలో ఉన్నప్పుడే చికిత్స అవసరం. ఇది సాధారణంగా బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్ ఫలితంగా కలుగుతుంది,

కండ్లకలక యొక్క కొన్ని సాధారణ లక్షణాలు:

- ఒక కంటిలో లేదా రెండింటిలో ఎరుపు లేదా గులాబీ రంగు ఏర్పడటం
- ఒక కంటిలో లేదా రెండింటిలో దురద లేదా రేపుదల
- కంట్లో ఏదో నలక పడినట్లుగా అనిపించడం (ఏదో ఉన్నట్లుగా)
- ఉబ్బిన కళ్ళు
- పొద్దునే లేవగానే లేదా నిద్ర పోయిన తర్వాత కళ్ళు తెరవలేకపోవడం
- కండ్లలో నుండి నీరుకారుట

కోవిడ్-19 కండ్ల కలక వస్తే డాక్టర్‌ను ఎప్పుడు కలవాలి?

కోవిడ్-19 వైరస్ కారణంగానూ సోకుతోంది. వ్యాధి సోకిన వ్యక్తి తుమ్మడం, దగ్గడం వల్ల సంక్రమిత చుక్కలు బయటకు విడుదలై సాధారణ ఉపరితలాలను తాకడం వల్ల వల్ల వస్తుంది. కండ్లకలక యొక్క ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సందర్శించడం మంచిది. అయితే, డాక్టర్ వద్దకు వెళ్లే ముందు, మీరు వారికి కాల్ చేసి తగిన కోవిడ్-19 భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలి.

'అయ్యప్ప'లు జాగ్రత్త తప్పనిసరి

అప్పారావు, గురుస్వామి, తిరుపతి రూరల్

అయ్యప్ప దీక్షను తీసుకున్న స్వాములు ఎక్కువగా తమిళనాడుకు టూర్‌కు వెళుతున్నారు. అక్కడ ఆ వైరస్ ఎక్కువగా స్వాములకు సోకుతోంది. యాత్ర ముగించుకుని ఇక్కడికి రాగానే కుటుంబ సభ్యులకు అంటుకుంటోంది. తమిళనాడు, కేరళ టూర్‌కి వెళ్లివస్తున్న అయ్యప్పస్వాములు వారి కుటుంబ సభ్యుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది

చెంగలరాయులు , బాధితుడు

ఇప్పుడు వస్తున్న కండ్లకలక తీవ్రంగా వేధిస్తోంది. రోజుల తరబడి కళ్ళు మంట, దురదతో ఇబ్బంది పెడుతోంది. వేగంగా ఒకరి నుంచి మరొకరికి పాకుతూ కుటుంబ సభ్యులకు సోకుతోంది. వారం నుంచి 10 రోజుల పాటు ఇన్ఫెక్షన్ తగ్గడం లేదు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

- కండ్లకలక వచ్చినప్పుడు కళ్లు దురదపెడతాయి. ఇలాంటి సందర్భంలో ఎట్టిపరిస్థితుల్లో కళ్లను నులమకూడదు.
- కంటి నుంచి నీళ్లు కారితే టిష్యూతో తుడిచి వెంటనే డస్ట్‌బిన్‌లో పారవేయండి.
- కండ్లకలక ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తుంది. కళ్లను తాకి, ఆ చేత్తో ఇతరులను తాకితే వెంటనే ఈ వ్యాధి వారికి వ్యాపిస్తుంది.
- కండ్లకలకతో బాధపడే వ్యక్తులు కాంటాక్ట్ లెన్సులు వాడటం మానేయాలి.
- యాంటీ బయాటిక్ డ్రాప్స్ వాడాలి. నీళ్లతో తరచూ కళ్లను కడుగుతుంటే దురద అనిపించదు.

అల్లా పల్లె వెలుగు బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చిత్తూరు మార్గంలో రెండు అల్లా పల్లె వెలుగు బస్సు సర్వీసులను పుత్తూరు ఆర్టీసీ డిపోలో గురువారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుత్తూరు నుంచి చిత్తూరుకు వెళ్లాలంటే బస్సులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారని..వీరిని దృష్టిలో ఉంచుకొని నూతనంగా రెండు సర్వీసులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. తిరుపతి ఆర్ఎం చెంగల్ రెడ్డి, పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి, అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ, పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్ జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు నరసింహారావు, జాన్ కెనడి, నాయకులు, ఆర్టీసీ అధికారులు, పాల్గొన్నారు.

ఆర్వోపీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ సూచించారు. గురువారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో ప్లాంట్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ప్రతి మూడు నెలలకోసారి నీటిని పరీక్షలకు పంపాలన్నారు. కెమికల్ ఉపయోగంలో పరిమితులు చూసుకోవాలని సూచించారు. ఆర్వో ప్లాంట్ల వద్ద క్రమం తప్పకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫుడ్ శాంపిల్స్, లైసెన్సు, ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నీటి కలుషితం జరగకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివుని దర్శించుకున్న మేడసాని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీటీడీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అన్నమాచార్య ప్రాజెక్టు డైరక్టర్, అవధాని, కవి, పండితుడు డాక్టర్ మేడసాని మోహన్ గురువారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా, అంజూరు ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఎస్టీ నాయకులపై దాడి హేయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ నాయక్, ఎస్టీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ దామోధర్ నాయక్ ఇళ్లపై పోలీసులు సీఐడీ పేరిట దాడులు చేయడం హేయమైన చర్యని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు సమావేశమయ్యారు. వైసీపీ ప్రభుత్వ లోపాలను ఎండగడితే కక్ష గట్టి పోలీసులను ప్రయోగించి దాడులు చేయించడం దుర్మార్గ చర్యని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. గోపి, లక్ష్మణ్, రామకృష్ణ, మణి పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.20 వేలు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దేవస్థాన అన్నదాన పథకానికి చెన్నయ్‌కు చెందిన లిఖిత సాయి కుటుంబం గురువారం రూ.20 వేలు విరాళంగా అందజేసింది. ఆ మొత్తాన్ని చెక్కురూపంలో పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి ముక్కంటి దర్శనార్థం నిత్యం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే సామాన్య భక్తుల సౌకర్యార్థం ఖర్చు చేయాలని కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శనం కల్పించారు.

బాలికలకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్:
గూడూరులోని మినీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రామ్మోహన్ రావు తండ్రి 50వ వర్ధంతి సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రోహిణి, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ నారాయణ, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సత్యశ్రీ విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీ ప్రియత, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ప్రెసిడెంట్ ధనంజయరెడ్డి, సేగు శీను, సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్‌రెడ్డి, రవీందర్, నర్సప్ప, హరినాథ్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గూడూరు రూరల్:
గూడూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పంచాయతీ రాజ్ శాఖ ఈఈ గిరినాథ్ అన్నారు. గురువారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకొని 40 మంది చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అతిథులు, దాతల చేతులమీదుగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రహాస్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకష్ణ, విశ్రాంత ఎస్ఈ కాంతారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కల్యాణ్ సాయి, కార్యదర్శి టీ. మురళీకష్ణ, కోశాధికారి ఆర్. రవిచంద్ర, మురళీరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, రమణయ్య, జగదీష్, రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

ప్రజాశక్తి-పాకాల: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని.. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని స్థానిక బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జీవీప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు.
గూడూరు రూరల్: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు తగిన జాగ్రత్తలు పాటించాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ రియాజ్ తెలిపారు. గూడూరు ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో 40 మంది పిల్లలకు న్యూట్రిషన్ ఆహారం అందించారు.
పుత్తూరు టౌన్: జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్ బారిన పడకుండా దూరంగా ఉండొచ్చని.. హెచ్ఐవీ సోకిన వారిని దూరం పెట్టడం సరికాదని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలి న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు రాఘవేంద్ర ఎయిడ్స్ నిర్మూలనపై గురువారం

శ్రీకాళహస్తిలో..

అవగాహన ర్యాలీ ప్రారంభించారు.
పిచ్చాటూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ, మానవహారం వంటి కార్యక్రమాలను వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ హమీద్‌ల నేతృత్వంలో చేపట్టారు. పట్టణంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు.
శ్రీకాళహస్తి: ప్రాణాంతక వ్యాధి ఎయిడ్స్‌కు మందు లేదనీ, నివారణే మార్గమని విక్రమ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాభి అన్నారు. విక్రమ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ సంక్రమణ, కలిగే అనర్థాలు, నివారణా చర్యలపై విద్యార్థులు ర్యాలీ ద్వారా నినదించి ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారు.
క్యాంపస్ : ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.. అప్రమత్తంగా ఉంటేనే వ్యాధిని నివారించడం సులభమవుతుందని ఉమెన్స్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య డి కష్ణమూర్తి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రకాశం భవనంలో ఉమెన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పోస్టర్లను అతికించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్ నివారణకు కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు రమణ, జగదీశ్వరి, రాజరాజేశ్వరి, శ్రీలత, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.
క్యాంపస్ : తితిదే విద్యాసంస్థ శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ ఎయిడ్స డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. అధికారి కె.కష్ణకిషోర్, ఎన్.సి.సి. అధికారి పి. రవికుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.
దొరవారిసత్రం: ఎయిడ్స వ్యాధిని నిర్మూలించేందుకు అందరూ సహకారం అందించాలని డాక్టర్ చైతన్య అన్నారు. గురువారం దొరవారిసత్రంలో ర్యాలీ నిర్వహించారు.

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లోకనాథం

- సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-పాకాల: సర్పంచులు ఎంపీటీసీలు, అధికారుల సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని.. ప్రతిఒక్కరూ సహకారం అందించాలని ఎంపీపీ లోకనాథం సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి మాట్లాడుతూ అధికారులు సమయ పాలన పాటించాలని.. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. లేనిపక్షంలో వీరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామకంఠం, వంక పోరంబోకు, ఇతర స్థలాలు కలిపి 580 ఇళ్లను రద్దు చేయడం జరిగిందని హౌసింగ్ ఏఈ తెలిపారు. ఇప్పటివరకు లబ్ధిదారులు వివిధ దశల్లో నిర్మాణ పనులు జరిగాయన్నారు. మత్తు పదార్థాలను సరఫరా చేసే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. సాయంత్రం వేళల్లో అంగన్‌వాడీ కేంద్రాలల్లో మందుబాబులు మద్యం తాగి సీసాలను పగులగొడుతున్నారని..చెత్తాచెదారాలను పడేసి వెళుతున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పోలీస్ అధికారులు స్పందించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు జరిగిన సమయంలో తమకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని పాకాల ఎస్.ఐ రామకష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ బాబు, తహసీల్దారు భాగ్యలక్ష్మి, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మబ్బునేని రఘుపతి, సింగిల్ విండో ఛైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏవో పుష్పావతి, వివిధ శాఖల అధికారులు, ఏవో కరుణాకర్ రెడ్డి, మండల కన్వీనర్ నరేష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ మార్చాలి

మధ్యాహ్నభోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి -నాయుడుపేట: మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ మార్చాలని నాయుడుపేట ఎంఈఓకి కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కార్మికుల జిల్లా కార్యదర్శి కే.విజయ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద అనే పేరుతో కొత్త మెనూ కరివేపాకు అన్నం, పులుసు అన్నం, మిర్యాలు పొంగలి, టమాటా బాత్, ఉదయం పూట టిఫిన్‌కి వాడే మెనూ మధ్యాహ్నం పిల్లలకి పెట్టడం వల్ల వారు తినలేక పోతున్నారని తెలిపారు. పాత మెనూని ఏర్పాటు చేసి నాణ్యత కలిగిన బియ్యం, పెరుగు లాంటి పోషకాహారం పిల్లలకి పెడితే బాగా తింటారని పిల్లలు తల్లిదండ్రులు తెలిపారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు మాత్రం కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు. వంట పాత్రలు మెనూకు సరిపడే బిల్లులు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానం వల్ల స్కూల్‌కు పిల్లలకు దూరం పెరగడంతో హాజరు శాతం తగ్గుతుందని ప్రైవేటు స్కూలు బాగా బలోపేతం అవుతున్నాయని అందువల్ల స్కూల్లో పిల్లలకి దగ్గరగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం జిల్లా కమిటీ సభ్యులు వాణి, లక్ష్మీ, జ్యోతి, మినమ్మ, మరి కొంతమంది సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ రైతులు లేక బోసిపోయిన సభ

ప్రజాశక్తి - క్యాంపస్ : రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం డా.వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డా. టి.జానకిరాం ఆధ్వర్యంలో స్థానిక చీని, నిమ్మ పరిశోధన స్థానం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇక్కడ 2021-22 స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి పాల్గొని ఉద్యాన పంటలలో పరిశోధనలు, మెలకువలు వంటి పలు పుస్తకావిష్కరణలు, సావనీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యాన విశ్వ విద్యాలయ ఆధ్వర్యంలో చీని, నిమ్మ పరిశోధనా స్థానంలో రైతులకు కష్ట నష్టాలలో అండగా నిలవాలని.. ఏడాదికొక పంటను ఎంపిక చేసి, దిగుబడి పెంచి పరిశోధనలు చేపడుతున్న శాస్త్రవేత్తలను అభినందిస్తున్నానన్నారు. పరిశోధనలు, ఉద్యాన పంటల రైతుల ప్రశ్నలు, సమాధానాల పుస్తక ఆవిష్కరనలతో పాటు కొత్త వెరైటీ పోస్టర్, చీనీ, నిమ్మ పాటల సి.డి లను ఆవిష్కరించారు. ఉద్యాన పంటలలో ప్రతిభ కనబరచిన రైతులను, పరిశోధనలో పాలు పంచుకొన్న శాస్త్రవేత్తలను, ప్రొఫెసర్లను ఘనంగా సన్మానించారు. పరిశోధన స్థానంలో వ్యవసాయ రైతులు లేక పూర్తిస్థాయిలో సభ బోసిపోయింది. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, పిడిఎపిఎంఐ.పి సతీష్, ఉద్యాన శాస్త్రవేత్తలు మధుమతి, నాగరాజు, నారం నాయుడు, ముకుంద లక్ష్మి, చినీ నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, రూరల్ ఎం.పి.టి.సి రత్నమ్మ, ప్రకతి వ్యవసాయం ఏపీఎం మునిరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎటుచూసినా సమస్యలే: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధిక ధరలు, భూకబ్జాలు, రౌడీయిజం, మత్తు పదార్థాల వినియోగం.. ఇలా అనేక సమస్యలతో రాష్ట్ర ప్రజలు ఇదేం ఖర్మరా అనుకొంటున్నారని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని అన్నారు. గురువారం మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తలపెట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నాని ప్రారంభించారు.ఇదేం ఖర్మ చంద్రగిరి నియోజకవర్గానికి, ఇదేం ఖర్మ తిరుమల నగర్ పంచాయతీకి అంటూ నినాదాలు చేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, అమ్మిలినేని మధు, కష్ణమూర్తి రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీధర్, మధుశేఖర్ ,పెరుగు భాస్కర్ రెడ్డి, కత్తిసుధా, సురేంద్ర, రామంజేరి మహేశ్వరి, హేమలత, అమరావతి, అజీజ్ భాష, గోవింద రాజు, రాంజీ, భూషణం, ప్రభాకర్, ఢిల్లీబాబు, రాధాకష్ణ, గంగాధరం, జనార్ధన్, మోహన్, మధు, రాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెండి ఉరువు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెన్నయ్‌కు చెందిన బాలాజీ కుటుంబ సభ్యులు గురువారం 140 గ్రాముల వెండి ఉరువులను వితరణ చేశారు. వాటిని పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి ప్రత్యేక పూజలు, అభిషేకాల సమయంలో స్వామీ అమ్మవార్లకు ధరింపజేయాలని సూచించారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శనం కల్పించారు.

రైతు భరోసాకు నమోదు

ప్రజాశక్తి-బివెన్‌కండ్రిగ: మండలంలో రైతు భరోసాకు అర్హులై ఉండి పేర్లు నమోదు కాని వారు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని.. పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్స్‌లను తీసుకురావాలని ఏవో భారతి తెలిపారు. ఈనెల 2వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పెళ్లి కుమార్తెకు పెండ్లి కానుక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ముస్లిం నవ వధువు రజియా భాయికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మేనమామ కానుకను అందజేశారు. ఆమె పేద పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మేనమామ కానుకగా బీరువా, డబుల్ కాట్ మంచం, బెడ్, కిట్ బాక్సును అందజేశారు. అనంతరం ఆమెకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

హరికృష్ణకు డీటీగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-బివెన్‌కండ్రిగ: బివెన్‌కండ్రిగ మండలంలో ఆర్ఐగా పనిచేస్తున్న హరికష్ణ డిప్యూటీ తహశీల్దారుగా పదోన్నతిపై పాకాల మండలానికి వెళ్లారు. గురువారం కార్యాలయంలో హరికష్ణ మండలంలో చేసిన సేవలను తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు కొనియాడారు. పాకాలలో ఆయన డిప్యూటీ తహశీల్దారుగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బివెన్‌కండ్రిగ: మండలంలోని పిల్లేటి వారి కండ్రిగ పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ యనమల కోటమ్మ ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఖర్చుతో పంచాయితీలో 42 మీటర్ల సీసీ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి-గూడూరు: వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలకు కష్టాలు తప్పడం లేదని.. ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి అంటూ ప్రజలు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారని టీడీపీ నాయకులు వాపోయారు. గురువారం గూడూరులోని గాంధీ నగర్ (21 వార్డు)లో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలతో పాటు వారి అభిప్రాయాలను సేకరించారు.

5న వాహనాలు వేలం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఈ నెల 5న సోమవారం పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బహిరంగంగా ద్విచక్ర వాహనాల వేలం జరుగుతుందని పుత్తూరు సీ.ఐ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా, ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 5వ తేదీన పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్ లో పరిధిలోని పోలీస్ స్టేషన్ లో ఉన్న 8 మోటార్ సైకిల్ ను బహిరంగంగా వేలం జరుగుతాయని సూచించారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి వేలం లో పాల్గొనాలని సూచించారు.

బ్రహ్మోత్సవ బహుమానంపై టీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని గుర్తించి బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వడానికి చర్యలు తీసుకున్న టీటీడీ ఛైర్మన్ వై వి సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని టిటిడి ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి టిటిడి ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానాన్ని అందిస్తున్నారని, కరోనా మహమ్మారి సమయంలో ఏకాంత సేవలు జరగడంతో టిటిడి ఉద్యోగులు అందరం కలిసి వద్దని తామే యాజమాన్యానికి తెలిపామన్నారు.

క్రైం న్యూస్

గుండెపోటుతో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి -పిచ్చాటూరు: గుండెపోటుతో మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన పిచ్చాటూరు గాంధీనగర్‌లో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు ఇలా ఉన్నాయి. అరణియార్ ప్రాజెక్టులో చేపల వేట చేసుకొని జీవనోపాధి పొందుతున్న మన్నరు నాయుడు కుమారుడు పి.రామచంద్రయ్య (65) నారాయణవనంలో చేపలు విక్రయిస్తున్న సమయంలో ఛాతీలో నొప్పి వచ్చి పడిపోవడంతో పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుంటుబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు చూసి తోటి మత్స్యకారులు, గాంధీనగర్ వాసులు కన్నీటి పర్వంతమయ్యారు.

పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం..!

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని భైరవరం గ్రామంలో గురువారం ఉదయం మంగళపూరి జయరామయ్య తన వ్యవసాయ పొలంలో వరి నారుకు పురుగు మందులు పిచికారీ చేస్తుండగా పక్క పొలంలో ఉన్న కొత్తపల్లి నాగరాజు వ్యవసాయం చేస్తున్నాడు. ఆ సమయంలో పాత కక్షలు మనసులో పెట్టుకుని తన చేతిలోని పారతో జయరామయ్యపై దాడి చేసి నరికేందుకు ప్రయత్నం చేశాడు. అక్కడి నుంచి తప్పించుకొని కేకలు పెడుతూ ఇంటికి వస్తుండగా కొత్తపల్లి పోలయ్య ఇంటి సమీపంలోని కరెంటు స్తంభానికి కట్టి వేశారు. గొంతు నలిపి కొత్తపల్లి పోలయ్య, బాలసుబ్రహ్మణ్యం, వెంకటయ్య చంపడానికి ప్రయత్నం చేశారు. దీంతో చుట్టుపక్కల వారు రావడంతో తీవ్రంగా గాయపడిన జయరామయ్యని చికిత్స నిమిత్తం వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. బాలాయపల్లి ఎస్ఐ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేశారు.

స్వచ్ఛంద ఆక్రమణలపై అవగాహన

ప్రజాశక్తి-కోట: కోట పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛంద ఆక్రమణలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో భవానీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొని సూచనలు చేశారు. ఎంపీడీవో భవానీ వ్యాపారులతో మాట్లాడుతూ ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకున్న ప్రతిఒక్కరికీ పంచాయతీ ఆధ్వర్యంలో నోటీసులు అందించామన్నారు. ఈ మేరకు నోటీసులు అందిన 7 రోజులు లోపు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. లేకుంటే పంచాయతీ ఆధ్వర్యంలోనే తొలగించబడుతాయని తెలిపారు. కోట పట్టణంలో రోడ్డు నిర్మాణం కోసం రూ.40 కోట్లకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నూతన మినీ శాఖ గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం పరిధిలోని చిన్న రాజకుప్పం గ్రామంలో నూతనంగా మినీ శాఖా గ్రంథాలయం పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని పుత్తూరు గ్రంథాలయ అధికారి కె.మీనాకుమారి ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థులకు, యువకులకు, ఉద్యోగులకు కావలసిన వివరాల కోసం ప్రభుత్వమే ఈ మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించిందన్నారు. ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు గ్రామంలో ఉన్న వారు పుస్తకాలు, న్యూస్ పేపర్లు వివిధ రకాల పుస్తకాలు ఉంటాయని వాటిని చదువుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పి.జనార్ధన్ యాదవ్, జె పద్మనాభం, జె సుందరం, దూర్వాసుల నాయుడు, జి.మునికృష్ణ మందిని, పి.మురళి యాదవ్, పి.చంద్రబాబు, ఎస్.కలాం భాషా, ఈ .దేవేంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు కౌన్సిలర్ సాయం

ప్రజాశక్తి- నాయుడుపేట:నాయుడుపేట పట్టణంలోని జడ్పీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో డి ఎస్ ఏ రెజ్లింగ్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు సమకూరు స్తామని

స్థానిక వైస్సార్సీపీ 24వ వార్డు కౌన్సిలర్ దారా. రవి తెలిపారు. గురు వారం సాయంత్రం వ్యాయమ కేంద్రాన్ని సందర్శించిన ఆయన రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రెజ్లింగ్ దుస్తులు అందజేశారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పిల్లలకు నా వంతు సాయం చేయడం ఆనందంగా ఉందని ఇక ముందు కూడా జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నవారికి ఇలాగే సహాయ పడేందుకు ఎప్పుడు ముందుంటానని అన్నారు ఆయనతో పాటు 13వ వార్డు కౌన్సిలర్ కూడా డంబుల్ బౌన్స్ బ్లాడర్లను అందజేశారు. తిరుపతి జిల్లా డి ఎస్ ఏ రెజ్లింగ్ కోచ్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

'మీ కోసం- మీ తెలుగుదేశం'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జనం కోసం: మీ కోసం - మీ తెలుగుదేశం కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం పుత్తూరు మండల పరిధిలో గోపాలకృష్ణపురం పంచాయతీలో గోపాలకృష్ణపురం, పైడిపల్లి గ్రామం హరిజనవాడ, ఆదిఆంధ్రవాడ, ఆనంబట్టు గ్రామం, తొర్రూరు గ్రామం హరిజనవాడ లలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ పుత్తూరు రూరల్ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. నగరి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ కార్యక్రమంలో పాల్గొంటారని, గ్రామ కమిటీ అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలో ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్ కళ్యాణ మండపంలో గురువారం సిపిఐ నియోజకవర్గస్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలతో పునాది మాత్రమే వేసుకోగలుగుతారన్నారు. ఇల్లు పూర్తి కావాలంటే సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. సిమెంటు, స్టీల్, ఇసుక, ఇటుక ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం లబ్ధిదారులకు నగదు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే..

'ఉక్కు' సంకల్పం అవసరం

- ఎన్నో ఆటుపోట్లతో జీవన ప్రయాణం
- జైజవాన్, జైకిసాన్ దేశానికి రెండు కళ్లు
- అనుభవ పాఠాలతో వ్యాపారవేత్తగా రాణింపు
- ప్రజాశక్తితో ఐరన్ అండ్ స్టీల్ డీలర్ కోట వీరబ్రహ్మం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

THOTA VEERA BRAHMAM
Managing Director

ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే 'ఉక్కు' సంకల్పం అవసరం. ఎన్నో అటుపోట్లతో నా జీవన ప్రయాణం సాగింది. జై జవాన్, జైకిసాన్ దేశానికి రెండు కళ్లు, దేశ సేవలోనూ.. వ్యవసాయంలోనూ ఎన్నో అనుభవాలను చవిచూశాను. ఈ అనుభవాల సారాన్ని అర్థం చేసుకుంటూ వ్యాపారవేత్తగా రాణించాలనే ప్రయత్నంలో కొంత వరకు సక్సెస్ అయ్యాను. ఐరన్ అండ్ స్టీల్ డీలర్‌గా తిరుపతిలో అందరికి సుపరిచితమే. త్వరలోనే ఆసుపత్రిని నిర్మించి నిరుపేద రోగులకు సేవ చేయాలని ఉంది. ఏడు కొండలవాని చెంత వ్యాపారవేత్తగా అంచెలంచెలుగా ఎదిగి, సేవామార్గం లోనూ ప్రజలకు దగ్గరై జీవన ప్రయాణం సాఫీగా సాగిపోవాలని కోరుకుంటున్నాను' అని ఐరన్ అండ్ స్టీల్ డీలర్ కోట వీరబ్రహ్మం అన్నారు. ప్రజాశక్తితో తన జీవిత విశేషాలను వివరించారు. నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, కాలుష్యం లేని కాలం, కల్మషం లేని మనుస్సు మధ్య జీవనం చాలా అందంగా సాగిందన్నారు. నేటి యుత ఉక్కు సంకల్పంతో లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు.

ఆయన జీవిత విశేషాలు ఆయన మాటల్లోనే....

మా స్వగ్రామం కడప జిల్లా పోరుమామిళ్ల. నా చిన్నప్పటి నుంచి చాలా చురుగ్గా ఉండేవాన్ని. అందరి దృష్టి నాపై ఉండేది. చిన్నమ్మ, వెంట్రామయ్య దంపతులకు రెండో కుమారుడిగా పుట్టాను. బతకడానికి సేద్యం చేస్తూ చాలీచాలని సంపాదనతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఒక్కోసారి నా తల్లిదండ్రులు కూర్చోబెట్టుకుని మా ఆర్థిక ఇబ్బందులను చెప్పేవాళ్లు. చాలా బాధేసేది. ఆ క్షణాలు ఇప్పటికీ నాకు గుర్తే. ఏనాడూ మా కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బందులు రాకూడదని అప్పడే నిశ్చయించుకున్నా. వ్యయప్రయాసాల మధ్య ఇంటర్ వరకు చదివాను. చిన్నప్పటి నుంచి ఏదో సాధించాలనే తపన ఉండేది. 1964లో త్రివిధ దళాల్లో నా వంతుగా దేశ సేవ చేశాను. దేశ రక్షణలో బాగంగా 21 సంవత్సరాలు పాటు వివిధ ప్రాంతాల్లో పని చేశాను. ఎన్నో అనుభవాలను నేర్చుకున్నాను. ఆ అనుభవాలు భవిష్యత్‌కు పాఠాలయ్యాయి. 1985లో తిరుపతిలో టెక్స్‌టైల్స్ వ్యాపారాన్ని ప్రారంభించాను. అప్పటికి తిరుపతిలో ఎక్కడా టెక్స్‌టైల్ వ్యాపారాలు లేకపోవడంతో నా అభివృద్ధికి మైలురాయి పడింది. ఆనాటి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నూతన వెరైటీల వస్త్రాలను తెప్పించి స్థానికులతో పాటు, తిరుపతికి వచ్చే యాత్రికులకూ అందించేవాన్ని. దీంతో తిరుపతికి వస్తే తిరుమల స్వామివారి లడ్డుతో పాటుగా మా వస్త్రాలను యాత్రికులను తీసుకెళ్లేవారు.

వృద్ధులకు ఆసరగా...

వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలు, వితంతువులకు గత 15 ఏళ్లుగా సొంత డబ్బుతో వారి ఖర్చులకు ప్రతి నెల పింఛన్ రూపంలో ఇస్తున్నాను. ప్రతి నెల రూ.300 ల చొప్పున 50 మందికి అందిస్తున్నాను. నా భార్య సుధాబ్రహ్మ సొంత ఊరైన పుత్తూరు సమీపంలోని అడివికండ్రిగ గ్రామంలో ఈ సేవ కార్యక్రాన్ని చేస్తున్నాను. దీంతో అక్కడి వారికి నా కుటుంబం ఏదో రకంగా సహాయ సకహాకారలను అందిస్తోంది.

త్వరలోనే హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తా...

తిరుపతి నగరంలో నిరుపేదలకు తక్కువ ఫీజుతో మెరుగైన చికిత్స అందించడానికి త్వరలోనే హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తాను. దీంతో నగరంలో పేద వారికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించే వీలవుతుంది.

In the Court of the Senior Civil Judge at Puttur
O.S.No.149/2015
S.Madhusudhana Raju ...Plaintiff
V/s
K.Munirathnam & others ..Defendants
Suit Summuns to Defendants No.4
Kanderi Lakshmi Kanthamma
W/o K.Narasimhulu Naidu,
D.No.19-8-121/G1, State Bank Colony, Tirupati Town
Please take suit summuns that the above suit is posted to Dt. 06.12.2022 for your appearance before the above said Honourable Court at 10.30 A.M. Either in person or through an advocate and Raise your objections if any failing which the matter will be decided in your obsence as exparte.
Hearing Date: 06.12.2022
B.RAJENDRUDU
A.SHIVAPRASAD
Advocates, Tirupati/Puttur

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO. 848/2018
O.S.NO. 145/2015
నగరం మునికిషోర్ కుమార్ ... పిటిషనరు/వాది
ఎదిరి
పగడాల సుబ్రమణ్యం రెడ్డి (died) & వగైరాలు
... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
నోటీసు
టు
2వ రెస్పాండెంటు:
శ్రీమతి పగడాల కుమారి భర్త లేట్ సుబ్రమణ్యం రెడ్డి
3వ రెస్పాండెంటు:
కుమారి పగడాల దీప్తి @ చిట్టి తండ్రి లేట్ సుబ్రమణ్యం రెడ్డి
4వ రెస్పాండెంటు:
శ్రీ పగడాల సాయి తండ్రి లేట్ సుబ్రమణ్యం రెడ్డి
R2 to R4 ల రెసిడెన్స్ ఆఫ్ సిరసనంబేడు గ్రామం & పోస్టు, పెళ్ళకూరు మండలం, తిరుపతి జిల్లా.
ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసు నందు గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు మీకు నోటీసును తేది. 08.12.2022 న వాయిదా వేసియున్నది. కావున ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల పై తెలిపిన కోర్టు నందు 08.12.2022వ తేదీ ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎ. సునీత, B.Sc., LL.B.,
ఎస్.కె. నాగూరు, B.Com., LL.B.,
పిటిషనరు/వాది తరపు న్యాయవాదులు, గూడూరు.
సెల్: 9441253794, 6281449260.